త్వరలో జార్కిహోళి సీఎం

- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వాస్ వ్యాఖ్య
- సీఎం పదవిపై కొనసాగుతున్న కుమ్ములాటలు

సతీశ్ జార్కిహోళి

బెళగావి: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికారం కోసం కుమ్ములాటలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ముఖ్యమంత్రి పదవిపై అధికార పార్టీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి త్వరలోనే ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్యే విశ్వాస్ వసంత్ వైద్య జోస్యం చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక ప్రాంత దళిత వర్గంలో జార్కిహోళి ప్రముఖ నేతగా గుర్తింపు పొందారని, నమ్మకమైన నేతగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆయనను ముఖ్యమంత్రి పీఠంపై చూడాలనుకుంటున్నారని అన్నారు. జార్కిహోళి సోదరులు ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలోనూ ఎంతో పలుకుబడి ఉన్న వ్యక్తులని అన్నారు. 2028లో సీఎం పీఠం తనదేనని ఇప్పటికే మంత్రి సతీశ్ జార్కిహోళి ప్రకటించారు.

మళ్లీ బీజేపీలోకి గాలి జనార్దన్‌రెడ్డి!

బెంగళూరు, నవంబర్ 21: ఇనుప గనుల అక్రమ తవ్వకాల కేసులో జైలుకెళ్లిన కర్ణాటక బీజేపీ మాజీ నేత గాలి జనార్దన్ రెడ్డి మళ్లీ కమలం పార్టీలో చేరాలని యోచిస్తున్నారు. ఆయన సన్నిహితులు మాట్లాడుతూ ఆరు నెలల కిందట జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడాన్ని, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనుండటాన్ని దృష్టిలో ఉంచుకొని బీజేపీ అధిష్ఠానం కూడా గాలి జనార్దన్ రెడ్డి చేరికకు సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. మాజీ సీఎం యెడియూరప్ప కుమారుడిని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా నియమించడంపై పలు విమర్శలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో జనార్దన్‌రెడ్డిని చేర్చుకుంటే కొంత కలిసొస్తుందని బీజేపీ భావిస్తున్నట్టు వెల్లడించారు.

ఒక్కడే రేప్ ఎలా చేస్తాడు?

బాధితులకు కర్ణాటక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే బెదిరింపులు

బెంగళూరు, నవంబర్ 21: ఒక మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న తన అనుచరుడిని వెనుకేసుకురావడంతోపాటు బాధిత కుటుంబసభ్యులపై బెదిరింపులకు పాల్పడుతూ కర్ణాటక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అమరేగౌడ పాటిల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనపై అమరేగౌడ అనుచరుడు సంగనగౌడ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఓ మహిళ గత నెల కొప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో.. న్యాయం చేయాలని కోరిన బాధిత కుటుంబసభ్యులతో అమరేగౌడ 'ఒక్కడే మహిళను రేప్ ఎలా చేస్తాడు? రేప్ చేయాలంటే కనీసం ముగ్గురు లేదా నలుగురైనా ఉండాలి. ఒక్క చేతితో చప్పట్లు మోగవు కదా!' అంటూ వికృతంగా మాట్లాడారు.

దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి యాంటీషిప్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించినట్టు నావికాదళం మంగళవారం వెల్లడించింది. డీఆర్‌డీవో సహకారంతో 42బీ హెలికాప్టర్ ద్వారా దీన్ని పరీక్షించినట్టు తెలిపింది.

డీకే థియేటర్లలో నీలిచిత్రాలు

- శివకుమార్ బ్లూఫిల్మ్స్ ప్రదర్శించేవాడు
- అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ అధికారమిచ్చింది
- కర్ణాటక డిప్యూటీ సీఎంపై మాజీ సీఎం కుమారస్వామి సంచలన ఆరోపణలు
- డీకే ఖండన.. నిరూపించాలని సవాల్

డీకే శివకుమార్

కుమారస్వామి

బెంగళూరు, నవంబర్ 21: కర్ణాటక రాజకీయాల్లో 'నీలి చిత్రాల' దుమారం రేగింది. డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. శివకుమార్ గతంలో నడిపిన సినిమా హాళ్లలో నీలి చిత్రాలు (పోర్న్ ఫిల్మ్స్) ప్రదర్శించేవారంటూ ఆరోపించారు. దొడ్డనహళ్లి, కనకపుర సమీపంలోని సతనూర్‌లలో ఆయన నిర్వహించే సినిమా థియేటర్లలో అశ్లీల చిత్రాలు ప్రదర్శించేవారని చెప్పారు. 'ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రజలు అటువంటి నేతను ఎన్నుకొన్నారు. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ అధికారం అప్పగించింది. ఇదీ.. అతని (డీకే శివకుమార్) సంస్కృతి' అంటూ పేర్కొన్నారు. ఈ ఆరోపణలను డీకే ఖండించారు.

కనకపురకు వెళ్లి ప్రజలను అడగండి..

కుమారస్వామి ఆరోపణలపై డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గం కనకపురకు వెళ్లి, తాను అటువంటి కార్యకలాపాలకు పాల్పడ్డానో? లేదో? అక్కడి ప్రజలకు అడిగి తెలుసుకోవాలని అన్నారు. ఆయన చేసిన ఆరోపణలను నిరూపిస్తే లేదా ఎవరైనా తాను అటువంటి కార్యకలాపాలకు పాల్పడ్డానని చెబితే, తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని కుమారస్వామికి సవాల్ విసిరారు. తనకు థియేటర్లు ఉన్నాయని ఒప్పుకొన్న డీకే.. ఇప్పుడు చేస్తున్న నీలి చిత్రాల ప్రదర్శనల ఆరోపణలను కుమారస్వామి గానీ, ఆయన తండ్రి హెచ్‌డీ దేవెగౌడ కానీ గతంలో తనకు వ్యతిరేకంగా పోటీచేసిన సమయంలో ఈ విషయాన్ని ఎందుకు లేవనెత్తలేదని, ప్రజలకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

తెగని బోర్డులు, కార్పొరేషన్ల పదవుల పంచాయితీ!

మరోవైపు కర్ణాటక కాంగ్రెస్‌లో సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లలో పదవుల నియామకంపై ప్రభుత్వంలోని, పార్టీలోని పెద్దల మధ్య సయోధ్య కుదరలేదు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఇతర సీనియర్ నేతలు ఎవరికి వారు తమ వర్గం ఎమ్మెల్యేలు, నేతలను ఆయా పదవుల్లో కూర్చొబెట్టేందుకు పట్టుబట్టడంతో ఈ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలను బెంగళూరుకు పంపుతున్నది. ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల పదవుల నియామకాలతోపాటు పలు పార్టీ అంశాలపై కూడా చర్చ జరుగుతుందని డీకే పేర్కొన్నారు. అన్ని నియామకాలు ఒక్కసారి జరుగవని, రెండు, మూడు దశల్లో ఉంటాయని వెల్లడించారు.

ఉద్యోగ కల్పన ధమాల్!

ఆర్నెల్ల కనిష్ఠానికి సంఘటిత ఉద్యోగాల సృష్టి

పడిపోయిన ఈపీఎఫ్ కొత్త సబ్‌స్క్రైబర్లు

సెప్టెంబర్ నెలలో 6.45 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, నవంబర్ 21: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ కల్పన పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు అటుంచితే.. లక్షలాది సంఖ్యలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను కూడా భర్తీ చేయడంలో విఫలమైంది. దీంతో దేశంలో నిరుద్యోగం భారీస్థాయిలో పెచ్చరిల్లుతున్నది. దేశంలో ఉద్యోగ కల్పన లేమిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) సోమవారం విడుదల చేసిన కొత్త సబ్‌స్క్రైబర్ల కు(పేరోల్ డాటా) సంబంధించిన గణాంకాలు స్పష్టం చేశాయి. సెప్టెంబర్‌లో సంఘటిత రంగంలో ఉద్యోగాల కల్పన ఆరు నెలల కనిష్ఠానికి చేరిందని పేర్కొన్నది. ఆగస్టు నెలలో *9,53,092* మంది కొత్త సబ్‌స్క్రైబర్లు నమోదు కాగా, అది సెప్టెంబర్‌లో *6.45* శాతం పడిపోయి *8,91,583* మంది సబ్‌స్క్రైబర్లు నమోదయ్యారని వెల్లడించింది.

తగ్గిన మహిళల భాగస్వామ్యం

కొత్త ఈపీఎఫ్ సబ్‌స్క్రైబర్లలో మహిళల శాతం కూడా దారుణంగా పడిపోయింది. ఆగస్టులో *26.12* శాతం *(2,48,980)* ఉండగా, సెప్టెంబర్‌లో *25.3* శాతానికి*(2,26,392* మంది) దిగజారింది. మరోవైపు *18-28* ఏండ్ల మధ్య వయస్కుల భాగస్వామ్యం స్వల్పంగా ఒక్క శాతం పెరిగింది. కాగా, భారతదేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరుకొన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) నివేదిక ఇటీవల వెల్లడించింది.

నేషనల్ హెరాల్డ్ ఆస్తులు జప్తు

రూ.752 కోట్ల విలువైన ఆస్తులు సీజ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ, నవంబర్ 21: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించి మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. రూ.*752* కోట్ల ఆస్తుల్ని జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) తోపాటు దాన్ని నిర్వహిస్తున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు తాత్కాలిక ఆదేశాలు ఇచ్చినట్టు ఈడీ వర్గాలు ప్రకటించాయి. ఏజేఎల్‌కు చెందిన ఆస్తుల విలువ రూ.*661* కోట్లు ఉంటుందని తెలిపాయి. పెట్టుబడులు, ఈక్విటీ షేర్ల రూపంలో యంగ్ ఇండియాకు రూ.*90.21* కోట్లు అక్రమ మార్గంలో చేరాయని ఈడీ పేర్కొన్నది. ఈ కేసులో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అతడి సోదరుడు ఎంపీ డీకే సురేష్, పవన్ బన్సల్‌లను ఈడీ నిందితులుగా పేర్కొన్నది. అవసరమైతే కాంగ్రెస్ నాయకుల్ని మళ్లీ విచారణకు పిలిచే అవకాశముందని ఈడీ వర్గాలు తెలిపాయి. నేషనల్ హెరాల్డ్ పత్రికకు ఏజేఎల్ ప్రచురణకర్తగా ఉంది. తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. 'అల్పమైన ప్రతీకార వ్యూహాలు కాంగ్రెస్ పార్టీని భయపెట్టలేవు. బీజేపీ భాగస్వామ్య పక్షంగా దర్యాప్తు సంస్థ ఈడీ వ్యవహరిస్తున్నది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ అన్నారు.

ఓటీటీ నెట్‌వర్క్‌లపై కేంద్రం నియంత్రణ!

న్యూఢిల్లీ: ఓటీటీ నెట్‌వర్క్‌లు అమెజాన్ ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్‌లను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తమ నియంత్రణలోకి తెచ్చుకుంటున్నాయని వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొన్నది. కేసుల బెదిరింపులు, పెద్దయెత్తున ఒత్తిడి తీసుకురావడం ద్వారా నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో వేదికలపై ఏ విధమైన కంటెంట్ ప్రసారం చేయాలో నిర్దేశిస్తున్నాయని వ్యాఖ్యానించింది. హిందూ మితవాదాన్ని, బీజేపీని , హిందూ మతాన్ని కించపరిచే రెఫరెన్స్‌లను తొలగించాలని ఆదేశిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించినట్టు పేర్కొన్నది. దీంతో భారత రాజకీయ, మత, కుల విభజనలపై ఈ ఓటీటీ నెట్‌వర్క్‌లు చేపట్టిన ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోవాల్సి వచ్చిందని, పూర్తయిన వెబ్ సిరీస్‌లు, సినిమాలు కూడా వీక్షకులకు నిలిపివేయబడ్డాయని నివేదించింది.

దేశం కోసం రాహుల్ ప్రాణాలర్పించారు!

నోరుజారిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

జైపూర్, నవంబర్ 21: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నోరుజారారు. అనుప్‌గఢ్ సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గురించి చెప్పబోయి 'దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ తన జీవితాన్ని అర్పించారు' అంటూ వ్యాఖ్యానించారు. దీంతో పక్కనే ఉన్నవారు అలర్ట్ చేయడంతో ఖర్గే తన వ్యాఖ్యలను సవరించారు. రాజీవ్ గాంధీ పేరుకు బదులు తప్పుగా రాహుల్ గాంధీ పేరు మాట్లాడానని, ఇందుకు క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యల వీడియోను ప్రతిపక్షాలు షేర్ చేస్తూ.. 'ఇదెప్పుడు జరిగింది?' అంటూ ఎద్దేవా చేశాయి.

బీజేపీ ఎంపీ బిధూరికి ప్రివిలేజ్ కమిటీ సమన్లు

న్యూఢిల్లీ: బీఎస్పీ ఎంపీ డానిష్ అలీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరికి లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ సమన్లు జారీ చేసింది. డిసెంబర్ 7న తమ ముందు హాజరు కావాలంటూ ఆదేశాలిచ్చింది. అదో రోజు మౌఖిక సాక్ష్యం ఇవ్వడానికి డానీష్ అలీ కూడా రావాలంది. కాగా, ఇంతకు మందు ఆదేశాలు జారీ చేసినా బిధూరి కమిటీ ముందు హాజరు కాలేదు. చంద్రయాన్-3 విజయవంతాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో సభ్యులందరి సాక్షిగా అలీపై బిధూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో స్పీకర్ దానిని ప్రివిలేజ్ కమిటీకి పంపారు.

జాతీయ విద్యా విధానంపై కన్నెర్ర

న్యూఢిల్లీ, నవంబర్ 21: కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలన్నీ ఐక్యంగా గళమెత్తనున్నాయి. దీని కోసం ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న పార్టీల అనుబంధ విద్యా సంఘాలు సహా దేశంలోని ప్రముఖ సంఘాలన్నీ 'యూనైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఏకమై పోరాటం సాగించనున్నాయి. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి 12న పార్లమెంట్‌కు భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించాయి. జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని 16 విద్యార్థి సంస్థలకు చెందిన ఐదు కోట్ల మంది విద్యార్థులు సమస్యలపై పోరాటం చేస్తారని డీఎంకే విద్యార్థి విభాగం నేత జేజహిరసన్ తెలిపారు. విద్యా వ్యవస్థ వాణిజ్యీకరణ, కాషాయీకరణ, ప్రైవేటీకరణపై యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా పోరాడుతుందని చెప్పారు.

యూజీసీ నెట్ సిలబస్‌లో మార్పులు!

న్యూఢిల్లీ, నవంబర్ 21: జాతీయ అర్హత పరీక్ష(నెట్) సిలబస్‌ను సవరించాలని యూనివర్సిటీ నిధుల సంఘం(యూజీసీ) నిర్ణయించింది. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ మంగళవారం తెలిపారు. కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టే ముందు అభ్యర్థులకు ప్రిపరేషన్ కోసం తగినంత సమయం ఇస్తామని చెప్పారు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం, అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షగా యూజీసీ-నెట్‌ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఏటా రెండు సార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి లబ్ధి

జమిలిపై కోవింద్ వ్యాఖ్య

రాయ్‌బరేలి : జమిలి ఎన్నికల నిర్వహణతో కేంద్రంలో అధికారమున్న పార్టీకి లబ్ధి చేకూరుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఒకవేళ ఇది అమలైతే, కేంద్రంలో బీజేపీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా.. అధికారంలో ఉన్న పార్టీకి లబ్ధి చేకూరుతుంది' అని అన్నారు. ఈ విధానంలో ఏ రాజకీయ పార్టీ కూడా వివక్షకు గురి కాదన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై కేంద్రం 8 మంది నిపుణులతో ఏర్పాటుచేసిన అత్యున్నస్థాయి కమిటీకి ఆయన నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు చేస్తున్న వ్యయం తగ్గుతుందన్నారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

బెయిల్‌పై వచ్చి.. వెంటాడి హత్య

- లైంగికదాడి బాధితురాలిని హత్యచేసిన నిందితుడు
- బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

న్యూఢిల్లీ, నవంబర్ 21: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా 19 ఏండ్ల లైంగిక దాడి బాధితురాలిని ఇద్దరు అన్నదమ్ములు మంగళవారం దారుణంగా గొడ్డలితో నరికి చంపారు. కౌశంబి జిల్లా డెర్వా గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామంలోని ప్రధాన రహదారిపై పట్టపగలు నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టారు. నిందితుల్లో ఒకరైన పవన్ నిషాద్ మూడేండ్ల క్రితం మృతురాలిపై జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడు. అతడి సోదరుడు అశోక్ నిషాద్ మరో హత్య కేసులో నిందితుడు. వీరిద్దరూ కొద్ది రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యారు. పవన్ అతడి అనుయాయులు మూడేండ్ల నుంచి లైంగిక దాడి కేసును ఉపసంహరించుకొమ్మని బాధితురాలిని వేధిస్తున్నారు. అయితే అందుకు ఆమె నిరాకరించింది. దీంతో పశువులను మేపి ఇంటికి తిరిగి వస్తున్న ఆమెను నిందితులు వెంటాడి హత్య చేసి పరారయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది. 'యూపీలో కిరాతకులకు చట్టాలంటే భయం లేదు, గౌరవం లేదు. ఇక్కడ ఆడ బిడ్డలు ఎంతో అభద్రతతో బతుకుతున్నారు. వారు తాము పొగొట్టుకొన్న గౌరవం కోసం గళం పెంచితే వాళ్ల ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది' అని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

పాఠ్యాంశాలుగా రామాయణం, మహాభారతం!

న్యూఢిల్లీ, నవంబర్ 21: పాఠశాల పాఠ్యపుస్తకాల్లో మార్పులకు సంబంధించి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) కమిటీ కీలక సూచనలు చేసింది. చరిత్ర పుస్తకాల్లో రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను చేర్చాలని ప్రతిపాదించింది. రాజ్యాంగ పీఠికను పాఠశాల తరగతి గదుల గోడలపై ఆయా స్థానిక భాషలలో రాయాలని సూచించినట్టు కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ సీ ఐజాక్ జాతీయ మీడియాకు తెలిపారు. సాంఘిక శాస్త్రానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ.. వేదాలు, ఆయుర్వేదం వంటి అంశాను పాఠ్యాంశాలుగా పరిచయం చేయాలని పేర్కొంది. ఈ కమిటీ చేసిన సిఫార్సుల ప్రకారం భారత దేశ చరిత్రను నాలుగు భాగాలుగా సంప్రదాయ యుగం, మధ్య యుగం, బ్రిటిష్ శకం, ఆధునిక యుగంగా విభజించాలి.

అధికారులతో మాట్లాడుతున్న కార్మికులు

సొరంగంలోని కార్మికుల వీడియో విడుదల

ఉత్తర్‌కాశీ, నవంబర్ 21: ఉత్తరాఖండ్ ఉత్తర్‌కాశీలోని సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల వీడియోను అధికారులు మంగళవారం విడుదల చేశారు. అందులో వారు అధికారులు పైప్ ద్వారా పంపిన ఆహారం స్వీకరించడం, పరస్పరం మాట్లాడుకోవడం కనిపించింది. కొత్తగా నిర్మించిన ఆరు అంగుళాల గొట్టం ద్వారా పంపిన ఎండోస్కోపిక్ కెమెరా ద్వారా కార్మికులను వీడియో తీశారు. బంధువులు, అధికారులు వారితో వాకీటాకీల ద్వారా మాట్లాడారు. కార్మికులను రక్షించేందుకు బల్కోట్ వైపు నుంచి డ్రిల్లింగ్ చేయడం, సమాంతరంగా సొరంగాలు తవ్వడం ఇతర ప్రత్యామ్నాయాలుగా అధికారులు ఉంచుకున్నారు. మూత్ర విసర్జన సమయంలో మంటతో బాధ పడుతున్న కొందరు కార్మికులకు మందులు పంపించినట్టు వైద్యుడు తెలిపారు.

ది గ్రేట్ రెస్క్యూ

న్యూఢిల్లీ, నవంబర్ 21: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్‌లో చిక్కుకున్న 41 మంది కార్మికులు సురక్షితంగా బయటకు రావాలని దేశం యావత్తు కోరుకుంటున్నది. టన్నెల్‌లో ప్రమాదవశాత్తు కార్మికులంతా చిక్కుకొని.. ఇప్పటికే 10 రోజులైంది. వారిని కాపాడేందుకు సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రపంచంలో గుర్తుండిపోయే రెస్క్యూ ఆపరేషన్లు వివరాలు పరిశీలిద్దాం..

2018-థాయ్ కేవ్ రెస్క్యూ: 13 మంది థాయ్ యూత్ సాకర్ టీమ్ (ఫుట్‌బాల్) క్రీడాకారులను రక్షించడానికి థాయిలాండ్‌లో చేపట్టిన 'థాయ్ కేవ్ రెస్క్యూ' ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భారీ వర్షాల కారణంగా.. వరదలు ముంచెత్తటంతో 2018 జూన్ 23న థామ్ లాంగ్ అనే గుహలో యువ క్రీడాకారులు చిక్కుకుపోయారు. 15 రోజులపాటు అత్యంత దయనీయ పరిస్థితులు ఎదుర్కొన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో 10 వేల మంది కిపైగా పాల్గొనటం గమనార్హం. వివిధ దేశాలకు చెందిన 90 మంది గజ ఈతగాళ్లు రంగంలోకి దిగారు. జూలై 10న అందరూ సురక్షితంగా బయటపడటంతో కథ సుఖాంతమైంది. రెస్క్యూ ఆపరేషన్ నేపథ్యంగా 'ద రెస్క్యూ', 'థర్టీన్ లైవ్స్', 'అగెయినిస్ట్ ద ఎలిమెంట్స్' సినిమాలు వచ్చాయి.

ఆపరేషన్ రాణిగంజ్

అది 1989 నవంబర్ 13.. పశ్చిమబెంగాల్‌లోని రాణిగంజ్.. ఓ గని లోపల 232 మంది కార్మికులు తవ్వకాలు జరుపుతుండగా ఒక్కసారిగా వరదనీరు ముంచెత్తింది. 161 మంది సురక్షితంగా బయటపడ్డారు. అయితే 65 మంది గనిలో చిక్కుకుపోయారు. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. చిక్కుకున్న వారిని కాపాడేందుకు కోల్ ఇండియా మైనింగ్ ఇంజినీర్ జశ్వంత్ గిల్ నేతృత్వంలో ప్రభుత్వం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. క్లిష్టపరిస్థితుల మధ్య స్టీల్ క్యాప్సూల్‌ని లోపలికి పంపి ఒక్కొక్కరిని బయటకు తీసుకొచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ రెస్క్యూ ఆపరేషన్ ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా కూడా రూపొందింది. అక్షయ్‌కుమార్ హీరోగా 'మిషన్ రాణిగంజ్: ద గ్రేట్ భారత్ రెస్క్యూ' సినిమా ఆకట్టుకుంది.

చిలీలో: 2010లో శాన్‌జోస్ బంగారు, రాగి గని కూలడంతో 33 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏకంగా 69 రోజులపాటు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

క్యూక్రీక్ మైనర్స్ రెస్క్యూ (2002): అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని సోమర్‌సెట్ కౌంటీలో జరిగిన గని ప్రమాదం ఘటన సంచలనం రేపింది. 77 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత 9 మంది గని కార్మికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

బోరుబావిలో పడ్డ 5 ఏండ్ల బాలుడు: హర్యానా కురుక్షేత్ర జిల్లా హల్దేరి గ్రామంలో ఐదేండ్ల బాలుడు 'ప్రిన్స్' 60 అడుగుల బోరుబావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. సుమారు 50 గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. సమీపంలో మరో బోరుబావిని గుర్తించి, ఐరన్ పైపులతో రెండింటినీ కనెక్ట్ చేసి బాలుడిని రక్షించారు.

38 పళ్లతో గిన్నిస్ రికార్డ్

న్యూఢిల్లీ, నవంబర్ 21: తమిళనాడుకు చెందిన కల్పన బాలన్(26) అత్యధిక దంతాలు(38) కలిగిన మహిళగా గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఆమెకు పై దవడలో నాలుగు, కింది దవడలో రెండు పళ్లు అదనంగా ఉన్నాయి. యుక్త వయసులో ఈ పళ్లు మొలిచాయని వీటి వల్ల నొప్పేమీ లేదని.. తరచూ వాటి మధ్య ఆహారం చిక్కుకుపోయేదని ఆమె తెలిపారు. 'గిన్నిస్ రికార్డు సాధించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది నా జీవిత కాల విజయం' అని కల్పన తెలిపారు. అదనపు దంతాలు కలిగి ఉండటాన్ని హైపర్‌డోంటియా అని పిలుస్తారు. అదనపు దంతాలు ఎందుకు ఏర్పడతాయో కచ్చితమైన కారణం తెలియదు.

కొవిడ్ టీకాతో ఆకస్మిక మరణాల ముప్పు తగ్గుదల

న్యూఢిల్లీ, నవంబర్ 21: కొవిడ్ టీకా యువతలో ఆకస్మిక మరణాల ముప్పును తగ్గించినట్టు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనంలో వెల్లడైంది. కనీసం ఒక డోసు తీసుకున్నా ఆకస్మిక మరణం ముప్పు తగ్గుతుందని తేలింది. ఈ అధ్యయన నివేదిక ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌లో ప్రచురితమైంది. యువతలో ఆకస్మిక మరణాలకు గల కారణాలను నిగ్గుతేల్చేందుకు *2021* అక్టోబర్ *1* నుంచి *2023* మార్చి *31* మధ్య కాలంలో ఓ అధ్యయనాన్ని చేపట్టిన ఐసీఎంఆర్.. ఆకస్మికంగా మరణించిన *18-45* ఏండ్ల వయసు వ్యక్తుల కేసులను పరిశీలించింది.

రాష్ట్రపతి సొంతూరుకు తొలి ఎక్స్‌ప్రెస్ రైలు

బదంపహార్ (ఒడిశా), నవంబర్ 21: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంతూరుకు తొలి సారి ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులు పెట్టిం